
సాక్షి
ఒడిశా
శనివారం । 19 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 3,78,695

బంగారం : 2 గ్రాముల 550 మిల్లీ గ్రాములు

వెండి : 13 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

## ఉన్నతాధికారి వేధింపులతో కోమాలోకి టీచర్

కొరాపుట్: ఉన్నతాధికారి వేధింపులతో ఓ టీచర్ కోమాలోకి వెళ్లిపోయారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కిలువా గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉమేష్ మాలిక్‌ను సమితి విద్యా విభాగ అదనపు అధికారి గురునాథ్ మజ్జి వేధింపులకు గురి చేశారు. సమితిలో మొత్తం 8 మంది ఉపాధ్యాయులకు ఫోన్ చేసి శాఖకి సంబంధం లేని పనులు చేయాలని ఒత్తిడి చేశారు. లేకపోతే పనిష్మెంట్‌లు ఉంటాయని హెచ్చరించారు. ఈ నెల 13 నుంచి ఉపాధ్యాయులకు ఈ వేధింపులు ప్రారంభమయ్యాయి. ఈ ఒత్తిడి ఎక్కువ కావడంతో ఉమేష్ తన భార్య వద్ద విలపిస్తూ కుప్ప కూలిపోయారు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా ఒత్తిడి వల్ల మెదడు దెబ్బ తిందని భువనేశ్వర్ తరలించమని సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు భువనేశ్వర్‌లోని ఉత్కళ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఉమేష్ కోమా లోకి వెళ్లిపోయారు. ఇది తెలిసిన సమితి ప్రాథమిక ఉపాధ్యాయులు మూకుమ్మడిగా జీఈఓ వద్దకు వెళ్లి జరిగిన ఘటన పై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

## న్యూస్‌రీల్

### పోలీసుల సాయంతో కుటుంబం చెంతకు తల్లి



కుమారుడికి తల్లిని అప్పగిస్తున్న పోలీసులు

భువనేశ్వర్: పూరీ తీర్థ యాత్రకు విచ్చేసిన కుటుంబం నుంచి 68 ఏళ్ల వృద్ధ మహిళ తప్పిపోయింది. స్థానిక పోలీసులు చొరవ కలిగించుకుని తప్పిపోయిన వృద్ధ మహిళని కుటుంబీకులకు భద్రంగా అప్పగించారు. తప్పిపోయిన వృద్ధ మహిళ శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం సోంపేట గ్రామస్తురాలు 68 ఏళ్ల పొందూరు వజ్రం. ఈ నెల 17వ తేదీ గురువారం శ్రీ మందిరం సందర్శించారు. దర్శనం తర్వాత లోపలి ప్రాకారంలో ఉత్తర ద్వారం పరిసరాల్లో కుటుంబం నుంచి వృద్ధ మహిళ విడిపోయింది. ఇతర కుటుంబీకులు గుర్తించే సరికి ఆమె జాడ కనుమరుగై పోయింది. శ్రీ మందిరం నలు వైపులు, సాగర తీరం తదితర పర్యాటక ప్రాధాన్య ప్రాంతాల్లో కుటుంబీకులు గాలించినా జాడ కనిపించలేదు. ఈ విషయమై పూరీ సింహ ద్వారం ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు దాఖలు చేసిన వివరాలు ఆధారంగా తప్పి పోయిన మహిళ కోసం గాలించిన పోలీసులు వృద్ధురాల్ని గుర్తించి ఈ నెల 18 శుక్రవారం సురక్షితంగా అప్పగించారు. రద్దీ, కొత్త ప్రాంతాల్లో వృద్ధులు, పిల్లల పట్ల నిర్లక్ష్యం తగదని పోలీసులు హితవు పలికి సాగనంపారు.

### 11 తాబేళ్ల పట్టివేత



కలిమెల అటవీ శాఖ వారు స్వాధీనం చేసుకున్న తాబేళ్లతో నిందితుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి అటవీ శాఖ వారు శుక్రవారం ఓ వ్యక్తి నుంచి 11 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎంపీవీ గ్రామంలో అక్రమంగా తాబేళ్లు విక్రయిస్తున్నట్లు కలిమెల అటవీ శాఖకు ముందస్తు సమాచారం రావడంతో శుక్రవారం ఉదయం అటవీ శాఖ వారు ఎంపీవీ 11 గ్రామంలో మిథున్ బేపారి అనే వ్యక్తి ఇంటిపై దాడి చేయగా వారి రాకను గమనించిన మిథున్ తాబేళ్లను బాత్రూమ్‌లో గోనెల సంచిలో చుట్టి దాచాడు. తనిఖీలో బాత్‌రూమ్‌లో ఉన్న తాబేళ్లను స్వాధీనం చేసుకుని మిథున్‌ను అరెస్టు చేశారు.

### చోరీ కేసులో నిందితుడు అరెస్టు



అరెస్టైన నిందితుడు గుప్త దాస్

జయపురం: పట్టణంలోని ఎంజీ రోడ్డులో సాయిబాబా మందిరం పక్కనున్న బ్యాటరీ దుకాణంలో రూ.4 లక్షల నగదు, బంగారు నగలు దొంగతనం కేసులో ప్రధాన నిందితుడిని పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడు ఛొటగుడకు చెందిన గుప్త దాస్‌గా గుర్తించారు. దొంగతనం జరిగిన రూ.4 లక్షల్లో అతడి వద్ద నుంచి రూ.25 వేలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ పోలీసు అధికారి ఎస్‌ఐ సిద్ధాంత బెహర వెల్లడించారు. నిందితుడు గుప్త దాస్‌పై 30కి పైగా దొంగతనాలు, దోపిడీలు మొదలగు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. గత జూన్ 29వ తేదీ రాత్రి దుకాణం గోడకు కన్నంపెట్టి రూ.4 లక్షలతో పాటు బంగారం, వెండి నగలు దొంగిలించాడని తెలియజేశారు. ఈ కేసులో ఇటీవల నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్న విషయం గుర్తు చేశారు. వీరిని విచారించి చోరీ సొత్తును రికవరీ చేయనున్నట్లు వెల్లడించారు.

### రెండు బైక్‌లు ఢీ : ఇద్దరు దుర్మరణం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి పోలీసు స్టేషన్ పరిధి సుర్లి గ్రామం జాతీయ రహదారిలో గురువారం రాత్రి ఒక ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రెండు మోటారు బైక్‌లు ఢీకొనటంతో ఇద్దరు సంఘటన ప్రాంతంలోనే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న కొట్‌పాడ్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేసుకొని క్షతగాత్రులను వెంటనే కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మరణించిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు. మరణించిన ఇద్దరిలో ఒకరు కొట్‌పాడ్ ఝొడిగుడ గ్రామం బైద్యనాథ్ గుప్త, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వాసి రఘునాథ్ భొలిగా గుర్తించారు. గాయపడిన ఇద్దిరిలో ఒకరు ఝొడిగుడ గ్రామం మొణిరాం పూజారి, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజారాం బాగెల్ అని పోలీసులు తెలిపారు.

# ఖరీఫ్ సాగుకు సన్నాహాలు



- 58.50 లక్షల హెక్టార్ల భూమిలో ఖరీఫ్ సాగు
- 9.55 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయింపు
- నేటి నుంచి ఖరీఫ్ వరి సేకరణ నమోదు



భువనేశ్వర్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సాగుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. సాగు కోసం అవసరమైన ఎరువుల విడుదలకు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియని శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సీజను ఆరంభం కావడంతో ఎరువుల విక్రయం, పంపిణీలో అవకతవకలు, అవినీతి, అక్రమాలకు కళ్లెం వేసేందుకు అనుబంధ యంత్రాంగం ముందస్తుగా సిద్ధమైంది. ఈ ఏడాది సమగ్రంగా 58.50 లక్షల హెక్టార్ల భూమిలో ఖరీఫ్ సాగు కోసం రాష్ట్రం ప్రణాళిక ఖరారు చేసింది. దీనిలో 34.94 లక్షల హెక్టార్లలో వరి, 23.56 లక్షల హెక్టార్లలో వరియేతర పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

భారత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ వ్యవసాయం కోసం సమగ్రంగా వివిధ గ్రేడ్‌ల 9.55 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రాష్ట్రానికి కేటాయించింది. దీనిలో ఇప్పటి వరకు రాష్ట్రానికి 7.94 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు విడుదల చేశారు. 3.65 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ ఎరువులు రైతులకు విక్రయించారు. వివిధ జిల్లాల్లో 4.24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అదనంగా, 23,589 మెట్రిక్ టన్నుల ఎరువులు త్వరలో వివిధ జిల్లాలకు చేరుకోవడానికి రవాణాలో ఉన్నాయి.

### 25 మంది డీలర్‌షిప్ లైసెన్సులు రద్దు

నల్ల బజారు, నకిలీ ఎరువుల వ్యాపారం నిరోధించేందుకు మార్క్‌ఫెడ్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, నకిలీ ఎరువుల సరఫరా నివారించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయం, రెవెన్యూ, పోలీసు శాఖలు జిల్లా, మండల స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఎరువుల రిటైల్, హోల్‌సేల్ పాయింట్లపై ఆకస్మిక తనిఖీల నిర్వహణ, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో 1,993 రిటైల్ పాయింట్లను తనిఖీ చేసి 427 మంది రిటైలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ధారిత నిబంధనలను ఉల్లంఘించినందుకు 8 కేసులలో స్టాప్ సేల్ నోటీసులు జారీ చేయగా, 25 మంది డీలర్‌షిప్ లైసెన్సులను రద్దు చేశారు.

## 'వందే భారత్'ను కొరాపుట్ వరకు నడపాలి

- ప్రధానమంత్రికి ఉత్కళ సమ్మిళినీ శాఖ లేఖ

జయపురం:

భువనేశ్వర్–విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కొరాపుట్ వరకు పొడిగించాలని ఉత్కళ సమ్మిళినీ కొరాపుట్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేరు రాసిన లేఖను విశాఖపట్నం రైల్వే డివిజన్ రెవెన్యూ మేనేజర్ ప్రవీణ కుమార్, ఏడీఆర్‌ఎం ఇ.శాంతారామ్‌లకు అందజేశారు. శుక్రవారం జయపురం రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సమయంలో ఉత్కళ సమ్మిళినీ కొరాపుట్ జిల్లా ప్రతినిధులు అధికారులకు లేఖను అందించారు. భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అరుకు మీదుగా కొరాపుట్ వరకు నడపాలని విజ్ఞప్తి చేశారు. అందువలన మారుమూల ప్రాంతమైన బహుళ ఆదివాసీ ప్రాంత ప్రజలు భువనేశ్వర్ వెళ్లేందుకు అధిక సౌకర్యం కలుగుతుందని వారు వినతి పత్రంలో వివరించారు. కొరాపుట్ జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి ఒకే ఒక రైలు ఉందని ఆ ట్రైన్ ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చలేక పోతుందన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు వైద్య, విద్యా సౌకర్యాలు, వాణిజ్య, వ్యాపారాల కోసం ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపైన ఆధారపడుతున్నారన్నారు. అందువల్ల రైల్వే సౌకర్యాలు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వందే భారత్ రైలు 800 కిలోమీటర్ల పరిధిలో గల పట్టణాలలో నడుస్తుందన్నార.



రైల్వే అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

అయితే భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం కేవలం 215 కిలోమీటర్ల దూరమని.. విశాఖపట్నం నుంచి అరుకు మీదుగా కొరాపుట్ వరకు నడిపితే 442 కిలోమీటర్లని వివరించారు. ఈ దూరాన్ని ఐదు గంటల్లోపే వందే భారత్ రైలుకు పడుతుందని వినతి పత్రంలో వివరించారు. వందే భారత్ రైలు నంబర్ 20841 భువనేశ్వర్ నుంచి కొరాపుట్ వరకు నడిపితే కేవలం 657 కిలోమీటర్లు అని ఈ దూరాన్ని చేరేందుకు తొమ్మిది గంటలు పడుతుందని పేర్కొన్నారు. కొరాపుట్ వరకు వందేభారత్ రైలును పొడిగిస్తే ఈ ప్రాంత ప్రజల ఆర్థిక సామాజిక ప్రగతికి దోహదపడిన వారౌతారని వెల్లడించారు. రైల్వే అధికారులకు మెమోరాండం అందజేసిన వారిలో ఉత్కళ సమ్మిళినీ జిల్లా అధ్యక్షులు మదన మోహన నాయిక్, ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గొప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస బాలా రాయ్, కార్యదర్శి నవీణ మదళ ఉన్నారు.

## • గాంధీజీ సాక్షిగా..



జాతిపిత గాంధీజీ సాక్షిగా విపక్ష బిజూ జనతా దళ్ శుక్రవారం మౌన నిరసన ప్రదర్శన చేపట్టింది. బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి సంఘటనపై న్యాయ విచారణ కోరుతూ బీజేడీ వర్గాలు శాంతియుత ధర్నాకు అంతా ఏకం అయ్యారు. స్థానిక మహాత్మా గాంధీ పార్క్‌లో బాపూజీ విగ్రహం వద్ద మూతికి నల్ల పట్టీలు బిగించి పెదవి కదపకుండా ప్లకార్డులపై రాతలతో తమ గళాన్ని వినిపించారు. సీనియర్ బీజేడీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నిశ్శబ్ద నిరసనలో పాల్గొన్నారు. - భువనేశ్వర్

## • కడతేరని కష్టం

భువనేశ్వర్: ఆత్మహత్యతో కన్ను మూసిన కూతురి మరణంతో క్షోభిస్తున్న తండ్రికి కష్టం రెట్టింపు చేసిన అమానుష సంఘటన వెలుగు చూసింది. బాలాసోర్ జిల్లా దెవులొ పంచాయతీ బింధాని సాహి ప్రాంతంలో మధు బింధాని అనే వ్యక్తి బీద గిరిజనుడు. అతని కుమార్తె ఆత్మహత్యతో ప్రాణాలు కోల్పోయింది. విషయం తెలియడంతో బలియాపాల్ ఠాణా పోలీసులు ఘటనా స్థలం చేరి లాంఛనంగా కార్యకలాపాలు ముగించి తదుపరి పరీక్షల కోసం శవాన్ని ఆస్పత్రికి తరలించాలని ఆదేశించి తప్పుకున్నారు. కానీ కన్నబిడ్డ మృతదేహం రవాణాకు చేతిలో చిల్లి గవ్వ లేక ట్రాలీ రిక్షాపై కూతురు శవాన్ని ఉంచి కన్నీటి భారంతో 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న బలియాపాల్ ఆస్పత్రి వరకు రిక్షాని లాగుకుంటూ పోయిన సంఘటన సర్వత్రా ఆవేదన కలిగించింది.



ట్రాలీ రిక్షాపై శవపరీక్ష కోసం కూతురి మృతదేహాన్ని తరలిస్తున్న తండ్రి

# ఏఎన్‌ఎం దారుణ హత్య

- పోలీసుస్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- కుటుంబ కలహాలే కారణమని వెల్లడి



రక్తపు మడుగులో శైలేంద్రీ మృతదేహం



శైలేంద్రీ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న డెప్పాగుడ గ్రామానికి చెందిన శైలేంద్రీ సరక (35) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యింది. సొంత బావ ఆమెను మరణాయుధంతో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం కల్యాణ సింగుపూర్ పోలీసుస్టేషన్‌లో తన మరదలను తానే హత్య చేశానంటూ లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సమితిలోని ధమునిపొంగ పంచాయతీ పరిధి డెప్పాగుడ గ్రామంలో భైమారిఖి ప్రేపక, శైలేంద్రీ భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరిలో భార్య శైలేంద్రీ ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తుండగా, భర్త భైమారిఖి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో భైమారిఖికి, అతడి అన్నయ్య లొత్ర మారిఖికి కొన్నాళ్లుగా భూతగాదాలు కొనసాగుతున్నాయి. గురువారం ఇద్దరూ మరోసారి ఘర్షణ పడ్డారు. శుక్రవారం భైమారిఖి పొలానికి వెళ్లడం గుర్తించిన లొత్ర మారిఖి ఇంట్లో తన మరదలు ఒక్కరే ఉండడం గమనించి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆ సమయంలో వంటపని చేసుకుంటున్న శైలేంద్రీ తలపై మరణాయుధంతో దాడిచేసి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత గ్రామంలోకి వెళ్లి తన తమ్ముడు భార్యను తానే హత్య చేశానంటూ చెప్పుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్లిపోయాడు. ఈ సమాచారాన్ని భైమారిఖికి గ్రామస్తులు తెలియజేయడంతో పరుగున వచ్చి రక్తపు మడుగులో ఉన్న భార్యను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాడు. అయితే అప్పటికే ఆమె మరణించిందని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

# వివాహిత అనుమానాస్పద మృతి

- హత్యేనని కన్నవారి ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు



అను బ్రెకబడక మృతదేహం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి చంచారగుడ గ్రామంలో అను బ్రెకబడక (23) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతురాలి తల్లిదండ్రులు ఇది హత్యేనంటూ బిసంకటక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృతురాలి భర్త మకర కద్రకను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చంచరగుడలో నివాసముంటున్న అను బ్రెకబడక, మకర కద్రకలు దంపతులు. శుక్రవారం తన భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేదని చికిత్స కోసం బిసంకటక్ ఆస్పత్రికి తరలించాడు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. కాగా మృతురాలి మెడకు గాయాలు కనిపించడంతో అనుమానించిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఇదిలాఉండగా గత ఐదేళ్ల క్రితం జిల్లాలోని చంద్రపూర్ సమితి కర్లాపంగ గ్రామానికి చెందిన సంతోష్ బ్రెకబడ కూతురుతో చంచారగుడ గ్రామానికి చెందిన మకర కద్రకతో వివాహం జరిగింది. కొన్నాళ్లు సాఫీగా సాగుతున్న వీరి వైవాహిక జీవితంతో రెండేళ్లుగా తనను భర్త మానసికంగా హింసిస్తున్నట్లు అను తన తల్లిదండ్రులతో చెబుతుండేది. ఈక్రమంతో తన కూతురు మృతి చెందిన సమాచారం తెలుసుకుని గ్రామానికి చేరుకున్న అనంతరం తన కూతురుది హత్యేనంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరింగింది.

### గర్భం దాల్చిన విద్యార్థిని

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి డుకుంలో ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఒక విద్యార్థినిని గర్భిణిగా గుర్తించారు. దీనికి సంబంధించి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బిసంకటక్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆశ్రమ పాఠశాలలో ఎప్పటిలాగే విద్యార్థులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో సదరు బాలిక గర్భం దాల్చినట్లు గుర్తించి, ఉపాధ్యాయులకు సమాచారం అందజేశారు.

### దివ్యాంగ యువతి ఫొటోలు మార్ఫింగ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండకు చెందిన ఓ దివ్యాంగ యువతి ఫొటోలను మారింగ్‌చేసి ఓ ప్రబుద్ధుడు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీనిపై ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యువతి తెలిపిన వివరాల మేరకు కేందుఝర్ జిల్లా ఘసిపుర సమితి మదన్‌పూర్ గ్రామనికి చెందిన శ్రీకాంత్ జెన అనే యువకుడు తన ఫొటోలను ఇలా మార్ఫింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఆ యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### ఆందోళనల కొనసాగింపు

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీ విద్యార్థిని సౌమ్యశ్రీ బిసి ఆత్మాహుతి మృతి పట్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. పూర్తి ప్రజాస్వామ్య విధానాలతో ఈ ఆందోళనలు నిర్వహించేందుకు విపక్ష బిజూ జనతా దళ్, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రభుత్వంపై దాడి చేస్తున్నాయి. ఈ సంఘటనలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు కంటి తుడుపు వైఖరిగా విపక్షాలు తోసి పుచ్చాయి. సమగ్ర సంఘటనపై న్యాయ విచారణ జరగాల్సిందేనని పట్టుబడుతున్నాయి. ఈ విషయమై ఇటీవల రాష్ట్ర కాంగ్రెసు ఒడిశా బంద్, బిజూ జనతా దళ్ స్థానిక లోక్ సేవాన్ భవన్ ముట్టడి ఆందోళనలు చేపట్టి తీవ్ర అలజడి రేపారు. ఈ ఆందోళనల్లో పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ, తోపులాట వంటి చిరు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇక నుంచి శాంతి భద్రతల్ని ప్రభావితం చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉభయ విపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ నెల 21న రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డిసి) స్థాయిలో నిరసన ప్రదర్శనకు బిజూ జనతా దళ్ శంఖారావం చేసిందని ఉపాధ్యక్షుడు దేబీ ప్రసాద్ మిశ్రా శుక్రవారం ప్రకటించారు. మరో వైపు దివంగత విద్యార్థిని సౌమ్యశ్రీ బిసి కర్మకాండ జరిగే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా శ్రద్ధాంజలి సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెసు ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# అమ్మవార్లకు ఆషాడం సారె



సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

రాయగడ: పట్టణంలోని గ్రామ దేవత బురదల పోలమ్మ, ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం మజ్జి గౌరమ్మ అమ్మవార్లకు పట్టణ ప్రజలు ఆషాడ మాసం సారెను శుక్రవారం సమర్పించారు. ఆషాడ మాసంలో ఆడబిడ్డలను సారె సమర్పిస్తుంటారు కాబట్టి, అమ్మవార్లను తమ ఇంటి ఆడ బిడ్డలుగా భావించి గత మూడేళ్లుగా ఆషాడ మాసం సారెను సమర్పిస్తూ ఇదే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. రాణిగుడ ఫారం, కస్తూరీనగర్, బుదరావలస తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు ఆదివాసీ సాంప్రదాయ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సారెను సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులతో పాటు 108 రకాల పిండి వంటలను అమ్మవారికి అందజేశారు. మజ్జిగౌరమ్మ అమ్మవారి మందిరంలో తీసుకువచ్చిన పిండి వంటలను అమ్మవారి ముందర పెట్టారు. ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖర్ బెరుకో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం తీసుకొచ్చిన సారెను అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రసాదంగా అందజేశారు.



అమ్మవారి ముందు సారె ఉంచిన దృశ్యం

# ఐటీఈఆర్ ఆడిటోరియంలో కమ్మిన పొగలు



ఎస్‌ఓఏ క్యాంపస్ అంతటా వ్యాపిస్తున్న పొగలు



ఆడిటోరియం నుంచి బయటపడుతున్న పొగలు

భువనేశ్వర్: నగరంలో పేరొందిన డీమ్డ్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఘోర ప్రమాదం త్రుటిలో తప్పింది. అదృష్టవశాత్తు పొగలు కమ్మిన ఆడిటోరియం నుంచి బయటపడి విద్యార్థులు బతికి బట్ట కట్టగలిగారు. స్థానిక జగమొరా ప్రాంతంలోని ఎస్ ఓఏ డీమ్డ్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగమైన ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్–రీసెర్చ్ (ఐటీఈఆర్) ఆడిటోరియం రెండో అంతస్తులో శుక్రవారం అకస్మాత్తుగా పొగలు కమ్మాయి. సకాలంలో అగ్ని మాపక దళం రంగంలోకి దిగి మంటలు నివారించడంతో ప్రమాద స్థలం నుంచి 65 మంది విద్యార్థులను సురక్షితంగా బయటకు తరలించారు. అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం తక్షణ ప్రతిస్పందనతో ఇది సాధ్యమైందని ఒడిశా అగ్నిమాపక శాఖ సీనియర్ అధికార వర్గాల సమాచారం. ఒక విద్యార్థి అస్వస్థతకు గురి కాగా ఆస్పత్రికి తరలించారు.

## క్లుప్తంగా

### బీజేడీ యువనేత మృతి


వి.సతీష్ (ఫైల్)

కొరాపుట్: బీజేడీ పార్టీ యువ నాయకుడు వి.సతీష్ (41) అనారోగ్యంతో నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గతంలో సతీష్ బీజేడీ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షునిగా, యువజన విభాగాలలో పనిచేశారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇతని మృతిపై రాజ్యసభ ఎంపీ మున్నా ఖాన్, మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎమ్మెల్యేలు ప్రకాష్ చంద్ర మజ్జి, సదాశివ ప్రదాని సంతాపం ప్రకటించారు.

### నడవలేని వారికి ఇంటివద్దే పింఛన్ అందజేత


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సునీత

కొరాపుట్: నడవలేని వారికి జయపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.సునీత వారింటికే వెళ్లి పెన్షన్ డబ్బులు అందజేశారు. శుక్రవారం 14వ నంబర్ వార్డులో 80 ఏళ్లు దాటిన వృద్ధులకు రు.3,500 నగదుని స్వయంగా అందించారు. ప్రతి నెల సక్రమంగా అందుతున్నాయో లేదని వాకబు చేశారు. దళారుల మాట నమ్మ వద్దని, పెన్షన్ డబ్బులలో తక్కువగా ఉంటే తనకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఎవరికైనా పెన్షన్ రాకపోతే ఫిర్యాదు చేయాలన్నారు. వైస్ చైర్మన్ స్వయంగా వచ్చి డబ్బులు అందజేయడంతో వృద్ధులు తమ సాదకబాధలు ఆమెతో చెప్పుకున్నారు.

### 'ఆడపిల్ల పుడితే మొక్క నాటండి'


నబరంగ్‌పూర్‌లో ఆడ పిల్లల తల్లులకు బేబీ కిట్‌లు అందజేస్తున్న అధికారులు

కొరాపుట్: ఆడపిల్ల జననానికి గుర్తుగా మెక్కలు నాటాలని నబరంగ్‌పూర్ అదనపు కలెక్టర్ తపన్‌కుమార్ కుంటియా పిలుపునిచ్చారు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి జునా పానీ గ్రామ పంచాయతీ కేంద్రంలో జరిగిన బేటీ బచావో–బేటీ పడావో, బిజూ కన్య రత్న పథకాల గురించి గిరిజనులతో జరిగిన అవగాహన సదస్సులో ప్రసంగించారు. ఆడ పిల్లల భవిష్యత్ కోసం ప్రభుత్వం అనేక రకాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అధికారుల నుంచి సమాచారం తీసుకోవాలన్నారు. ప్రతి ఆడపిల్ల భవిష్యత్ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని కుంటీయా అన్నారు. కార్యక్రమంలో భాగంగా 30 మంది ఆడ పిల్లల తల్లులకు బేబీ కిట్‌లు అందజేశారు. ఆ ప్రాంతంలో 30 మంది ఆడ పిల్లల పేర్ల మీద పండ్ల మెక్కలు నాటారు.

### పట్టుబడిన కాపర్ దొంగ!

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో పలుప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న బిల్డింగ్‌ల వద్ద లక్షలు విలువ చేసే వైరులోని కాపర్‌ను దొంగిలించిన వ్యక్తి రెండో పట్టణ పోలీసుల అదుపులో ఉన్నాడని విశ్వసనీయ సమాచారం. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడుకు చెందిన నిందితుడు ముందుగా హైదరాబాద్‌లో ఉండేవాడని.. జల్సాలకు అలవాటు పడి 2017, 2018, 2023లో ఇళ్లల్లో తలుపులు పగులగొట్టి చోరీలకు పాల్పడేవాడని, రెండో పట్టణ పోలీసులకు అప్పట్లో పట్టుబడినట్లు తెలిసింది. విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

### పేకాట శిబిరంపై దాడులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని జెడ్పీ వెనుక గల కామేశ్వరి కల్యాణ మండపం సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్సు పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఐ కృష్ణమూర్తి నేతృత్వంలో దాడులు నిర్వహించగా ఐదుగురు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.46,970 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో బి.గోవింద, బి.ప్రసాద్, ఎస్.కె.ఆలీ, ఎం.మోహనకృష్ణ, ఎం.రాజశేఖర్ ఉన్నారు. వీరి వద్ద నుంచి ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆమె నేత్రాలు సజీవం


జయలక్ష్మి(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చంపాగల్లివీధిలో నివాసం ఉంటున్న అంధవరపు జయలక్ష్మి (68) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారుడు అంధవరపు సుబుద్ధి, కోడలు సత్యవతి, జి.లక్ష్మిలు వలసయ్య ద్వారా విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్ చార్జి సుజాత, జగదీష్‌ల ద్వారా జయలక్ష్మి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842 699321నంబరును సంప్రదించవచ్చని కోరారు.


కార్యక్రమం ప్రారంభంలో సబ్‌కలెక్టర్ శౌశ్యా రెడ్డి తదితరులు


పిల్లలకు చేతుల శుభ్రతపై శిక్షణ ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


పారిశుధ్యం, పట్టణ పరిశుభ్రతలపై ప్రజలకు వివరిస్తున్న అధికారులు


పెంట కుప్పలు నిషేధమని ప్రజలకు తెలిపే పోస్టర్‌ను ప్రదర్శించిన అధికారులు

# చెత్త రహిత పట్టణంగా జయపురం

జయపురం: జయపురం పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పరిశుభ్రంగా ఉంచుదాం, వ్యాధుల రహిత పట్టణంగా మారుద్దాం అభిజాన్‌కు శ్రీకారం చుట్టింది. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ వారి స్వచ్ఛ భారత్ అభిజాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పారాబెడ ప్రాంతంలో జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారిణి కుమారి అక్కవరం శౌశ్యా రెడ్డి కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రజలలో పరిశుభ్రతపై ప్రత్యేక చైతన్యాన్ని కల్గించేందుకు 'సఫైయ్ అపనో–బిమారి భగావ్ కేంపిన్ 2025' ( మీరే శుభ్రపరచుకొండి వ్యాధులను పారదోలండి -2025) అభిజాన్ ను ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని పారాబెడ డంపింగ్ పాయింట్‌ల వద్ద ప్రారంభించారు. ముఖ్యంగా బహిరంగ ప్రాంతాలలో వ్యర్థ పదార్థాల పోగు చేసేపెంట కుప్పలకు స్వస్తి చెప్పి ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని అన్నారు.



# సైబీరియా నుంచి.. తేలుకుంచి

తేలుకుంచి 'కొంగొత్త' అందాలు సంతరించుకుంటోంది. తొలకరి మబ్బుల వెంట వేలాదిగా పక్షులు సైబీరియా నుంచి తేలుకుంచికి వలస వస్తున్నాయి. ఇక్కడి చెట్టుతో జట్టు కట్టడం, ఈ నేల రుచిని ఆస్వాదించడం, ఈ గాలిలో విహరించడం.. శతాబ్దాలుగా ఈ అతిథి విహంగాలకు అలవాటు. కానీ ఏడాది గూడు పెట్టేందుకు చెట్లు కరువవుతున్నాయి. గడ్డివాములు, ఇళ్లపై గూళ్లు పెట్టాల్సి వస్తోంది.

- చెట్లపై సందడి చేస్తున్న విదేశీ విహంగాలు
- అరకొర చెట్లు ఉండడంతో గుడ్లు పెట్టేందుకు పాట్లు
- పట్టించుకోని అటవీ శాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్:

వేల కిలోమీటర్ల నుంచి అతిథి పక్షులు తేలుకుంచి చేరిపోయాయి. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు చిత్ర విచిత్రమైన కూతలతో చెట్లపై ముసురుకుంటున్నాయి. ఏటా తొలకరి జల్లులు కురిసే జూన్ మాసాంతరానికి వచ్చే పక్షులు ఈ ఏడాది కూడా ఏతెంచాయి.

**కొమ్మకొమ్మకు పురిటి కేంద్రాలు**

చెట్లపై కొమ్మలు, రెమ్మలు ఉంటే తప్ప గూడు ఏర్పాటు చేసుకోలేని ఈ పక్షులు గుడ్లు పెట్టేందుకు గ్రామం చుట్టూ ఉన్న చెట్లనే ఆశ్రయిస్తుంటాయి. ఒక్కో పక్షి రెండు నుంచి ఆరు గుడ్లు వరకు పెడుతుంటాయి. సుమారు 27 నుంచి 30 రోజుల వరకు తల్లి పక్షి గుడ్లను పొదుగుతుంది. పొదిగిన రోజు నుంచి 36 రోజుల పాటు ఆహారాన్ని తీసుకువచ్చి అందించి పిల్ల పక్షులను సంరక్షిస్తాయి. పిల్ల పక్షులకు శక్తి వచ్చి ఎగిరేంత వరకు తల్లి పక్షి లేదా మగ పక్షి గూళ్లో వీటికి కాపలాగా ఉంటాయి.

**స్థానికులతో అనుబంధం**

ఎక్కడో సైబీరియా నుంచి ఇక్కడి వరకు వచ్చే పక్షులకు అసలైన బంధువులంటే ఈ గ్రామ వాసులే. ఈ గ్రామస్తులతో పక్షులకు విడదీయలేని అనుబంధం ఉంది. పక్షుల రాక ఏ మాత్రం ఆలస్యమైనా కంగారుపడిపోతారు. ఇవి వస్తేనే వానలు కురుస్తాయని ఇక్కడి వారి నమ్మకం. తాము కూర్చున్న చోట, పక్కనే వాలుతాయని, వీటిని వేటగాళ్ల బారినుంచి గ్రామస్తులమే రక్షిస్తుంటామని చెబుతున్నారు. ఒకవేళ ఎవరైనా పక్షులకు హాని తలపెట్టాలని చూస్తే గ్రామ కట్టుబాటు ప్రకారం ఆ వ్యక్తికి గుండు గీయించి ఊరేగిస్తామని హెచ్చరిస్తున్నారు.

**ఇవే ప్రత్యేకతలు**

- వీటి అసలు పేరు ఓపెన్ బిల్ స్టార్క్స్. వీటి శాస్త్రీయ నామం 'అనస్థోమస్'.
- ఈ పక్షులు తూర్పు–దక్షిణాసియా ఖండంలో ముఖ్యంగా భారతదేశం, శ్రీలంక నుంచి మొదలుకొని తూర్పు ప్రాంతంలో విస్తారంగా సంచరిస్తుంటాయి.
- వీటి జీవిత కాలం సుమారు 30 ఏళ్లు.
- బాగా ఎదిగిన పక్షి 81 సెంటీమీటర్ల పొడవు, 11 కిలోల బరువు ఉంటుంది. రెక్కలు విప్పారినప్పుడు 149 సెంటీ మీటర్ల వరకు ఉంటుంది.
- దవడల మధ్యన (ముక్కు మధ్యలో) ఖాళీ ఉండటం వల్ల వీటిని ఓపెన్ బిల్ స్టార్క్స్ అని అంటారు.
- పగలంతా తంపర భూముల్లో, వరి చేలల్లో తిరుగుతూ చేపలు, నత్తలు, కప్పలు, పురుగులు, ఆల్చిప్పలను ఆహారంగా తీసుకుంటాయి.

**విడిది ఏదీ..?**

గతంలో వచ్చిన వరుస తుఫాన్ల తీవ్రతకు ఇక్కడ చాలా చెట్లు నేలకొరిగాయి. 2018లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు వందలాది పక్షులు మృత్యువాత పడ్డాయి. ఈ ఏడాది వందల సంఖ్యలో పక్షులు వస్తున్నాయి. ప్రస్తుతం పక్షులు గూళ్లు పెట్టేందుకు నానాపాట్లు పడుతున్నాయి. చెట్లు లేక గడ్డికుప్పలు, ఇళ్లపై, పంట పొలాల చాటున గూళ్లు పెట్టుకునేందుకు సిద్ధపడుతున్నాయి. రాత్రి సమయాల్లో విష పురుగులు బారిన పడి పక్షులు మృతి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మూలకు చేరిన పక్షుల చికిత్సాలయం

**సంరక్షణ గాలి..**

పక్షులను సంరక్షించాల్సిన అటవీ, పర్యావరణ శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో చెట్లు పెంచాల్సిన అటవీశాఖ సిబ్బంది జాడే లేకుండా పోయింది. ఏడాదికో మారు గ్రామంలో చిన్నపాటి సమావేశాలు పెట్టి ఫొటోలు తీసి వెళ్లిపోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ గతంలో పర్యాటక శాఖ అధికారులతో పర్యటించి రూ.25లక్షలతో సుమారు ఎకరా దేవదాయ భూమిలో పర్యాటక కేంద్రాన్ని నిర్మిస్తానంటూ హామీ ఇచ్చి పదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నెరవేరలేదు.

**పక్షుల విహార కేంద్రానికి ప్రయత్నం**



తేలినీలాపురం మాదిరి తేలుకుంచిలో పక్షుల విహార కేంద్రం నెలకొల్పేందుకు సుమారు రూ.పది లక్షల అంచనాతో గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. గ్రామంలో మొక్కలు నాటేందుకు గ్రామస్తు లు సహకరించడం లేదు. పక్షుల సంరక్షణకు చర్య లు తీసుకుంటున్నాం.
– ఎ.మురళీకృష్ణంనాయుడు,ఫారెస్ట్ రేంజ్ అధికారి

### గంజాయి రవాణా గుట్టురట్టు

నరసన్నపేట: ఒడిశా నుంచి చెన్నైకి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నరసన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది గురువారం సోదాలు నిర్వహిస్తుండగా గంజాం జిల్లా సింగిపూర్ గ్రామానికి చెందిన అజిత్‌కుమార్ నాయక్, దేవేంద్ర ప్రధాన్‌లు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా మూడు ప్యాకెట్లలో 18.750 కేజీల గంజాయి గుర్తించారు. గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

**13 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు**

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి ముంబైకి 13 కిలోల గంజాయి తరలిస్తున్న సునీల పాయక, మహన్ నాయక్‌తో పాటు మరో బాల నేరస్తుడిని అరెస్టు చేసినట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణ ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది రైల్వేస్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించగా వీరంతా అనుమానాస్పద స్థితిలో కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారణ చేయగా 13 కిలోల గంజాయి పట్టుబడింది. వీరిని అరెస్టు చేసి బైక్, మూడు ఫోన్లు సీజ్ చేశారు.

### వ్యాపారులకు నోటీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని 50కు పైగా తోపుడు బండ్ల వ్యాపారులకు ట్రాఫిక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శబ్దకాలుష్యనివారణ మొదటి హెచ్చరికలో భాగంగా నోటీసులిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు శుక్రవారం తెలిపారు. మైక్ ద్వారా నిరంతరం శబ్దాలు చేస్తుండటంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నోటీసులు ఇచ్చామని, మరోసారి ఇలా చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు.

### కొత్త కెరండీ ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం


వార్షికోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న గుసాని సమితి విద్యాశాఖ అధికారి సీతారాం పాత్రో


ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేస్తున్న గుసాని బ్లాక్ విద్యాశాఖ అధికారి సీతారాం పాత్రో


పాఠశాల విద్యార్థినులకు బహుమతి ప్రదానం

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి కొత్త కెరండీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షికోత్సవాన్ని విద్యా కమిటీ అధ్యక్షుడు లింగరాజ్ మిశ్రా ప్రారంభించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ముంగి రవికుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా గుసాని సమితి విద్యాశాఖ అధికారి సీతారంపాత్రో, ఉప విద్యాశాఖ అధికారి కె.సోమేశ్వరరావు పాల్గొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలలో చేరేటట్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అనంతరం వివిధ వక్తృత్వ, డ్రాయింగ్, ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు ముఖ్య అతిథి సీతారాం పాత్రో, లింగరాజ్ మిశ్రా చేతులమీదుగా మెమొంటోలు, బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సి.ఆర్.సి.సి. సి.హెచ్.గౌరీ, గుమ్మా బ్లాక్ ఉపాధ్యాయులు అమూల్య పాణిగ్రాహి, పర్లాకిమిడి గాంధీ మెమోరియల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎం.తిరుపతిరావు, విద్యాకమిటీ ఉపాధ్యక్షులు జయక్రిష్ణ జెన్నా పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో తొలిసారిగా క్యాంపస్ డ్రైవ్

రణస్థలం :

ఎచ్చెర్లలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లో శుక్రవారం మొట్టమొదటి సారిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మియామి టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 180 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ మాట్లాడుతూ ఐఐఐటీ స్థాపించిన తొలినాళ్లలో ఇంజినీరింగ్ విద్యార్థులకు నూజివీడులో తరగతులు నిర్వహించేవారని, అందుకే క్యాంపస్ డ్రైవ్‌లన్నీ అక్కడే జరిగాయని చెప్పారు. తాజాగా ఎచ్చెర్ల క్యాంపస్‌లోనే అన్ని ఇంజినీరింగ్ పీఈయూసీ, క్లాస్‌వర్క్‌లు జరుగుతున్నాయని, అందుకే తొలిసారిగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు వస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. క్యాంపస్ డ్రైవ్ విజయవంతం కావడంలో పరిపాలనాధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, సీఎస్ఈ విభాగాధిపతి రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వరప్రసాద్ కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో మియామి టెక్నాలజీస్ ప్రతినిధులు నవీన్, రవిరామ్ వర్మ, అధ్యాపకులు, విభాగాధిపతులు, సిబ్బంది ప్లేస్‌మెంట్ టీమ్ ప్రతినిధులు వాగ్దేవి, ప్రహార్సిత్ పాల్గొన్నారు.

# వేర్వేరు చోట్ల చోరీలు


జె.ఆర్.పురంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి, క్లూస్ టీం సభ్యులు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో బంగారం షాపు నిర్వహిస్తున్న లెంక దిలీప్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దిలీప్ తన పిల్లలను చదువు నిమిత్తం శ్రీకాకుళంలోనూ ఇల్లు తీసుకుని అక్కడికి వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలో క్రమంలో గురువారం శ్రీకాకుళం వెళ్లిన దిలీప్ శుక్రవారం జె.ఆర్.పురంలో ఉన్న ఇంటికి వెళ్లగా తలుపుల తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. వెంటనే జే.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి వెండి, బంగారం ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. క్లూస్ టీం సభ్యులు ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**టెక్కలి శ్రీనివాసనగర్‌లో..**

టెక్కలి రూరల్: స్థానిక శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఏపీఎస్పీ ఏఎస్ఐ నర్సింహమూర్తి ఇంట్లో చోరి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్ పిల్లలబంద చెరువు సమీపంలో నివాసముంటున్న నర్సింహమూర్తి నెలరోజుల క్రితం హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యజమాని నర్సింహమూర్తి హైదరాబాద్ నుంచి శనివారం వస్తున్నారని, ఆయన వచ్చాకే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# హాల్‌మార్క్ ప్యూరిటీ లేదు ష్యూరిటీ



నకిలీ హాల్‌మార్క్ వేసేందుకు నరసన్నపేటలోని ఓ టెస్టింగ్, హాల్‌మార్క్ సెంటర్‌లో వినియోగించిన లేజర్ మిషన్

- జిల్లాలో గోల్డ్ మోసాలు
- సొంత మిషన్లతో అనుమతి లేకుండా హాల్‌మార్క్ సెంటర్ల ఏర్పాటు
- వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్‌తో ఆభరణాలపై ముద్ర
- బయటపడకుండా పక్కాగా మోసం
- నరసన్నపేటలో వెలుగుచూసిన మోసంతో ఉలిక్కిపడిన జిల్లా వాసులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో బంగారం మోసాలు గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నాయి. నాణ్యతకు మారుపేరుగా భావించే హాల్‌మార్క్‌పైనే నకిలీ మకిలి పడుతోంది. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి హాల్‌మార్క్ ఉన్న తన పాత బంగారం ఆభరణాన్ని ఇచ్చేసి, కొత్త ఆభరణం తీసుకుందామని విశాఖలోని ఓ ప్రముఖ కార్పొరేట్ జ్యూయలరీ షాపు వద్దకు వెళ్లారు. వారు అన్నీ పరిశీలించి 75 శాతం మాత్రమే ప్యూరిటీ ఉందని చెప్పారు. హాల్‌మార్క్ ఉన్నప్పటికీ 25 శాతం కోల్పోవాల్సి వచ్చింది. జిల్లాలో జరుగుతున్న బంగారం మోసాలకు ఇదో మచ్చుతునక. జిల్లాలో హాల్‌మార్క్ ఉన్నప్పటికీ మోసపోతున్న వాళ్లు చాలా మంది ఉన్నారు. పాత బంగారం కొనుగోలు చేసిన షాపు దగ్గరికి వెళ్లి అడిగితే అబ్బే మాకేం సంబంధం లేదు.. ఆ వస్తువు మా దగ్గర కొనలేదని దాటేసే పరిస్థితులు ఉన్నాయి. విక్రయించినప్పుడు చెప్పిన మాటలు తర్వాత ఉండటం లేదు. వీరి వల్ల నిజాయితీగా వ్యాపారం చేసే వ్యాపారులకు సైతం మచ్చ పడుతోంది.

**జిల్లాకే చెడ్డపేరు..**

బంగారం వ్యాపారానికి నరసన్నపేట ప్రసిద్ధి గాంచింది. మొదటి నుంచి క్వాలిటీ బంగారం దొరకదని పేరు ఉంది. ముఖ్యంగా దొంగతనం బంగారం, నాణ్యత తక్కువ ఉన్న ఆభరణాలు, ట్యాక్స్ చెల్లించని బంగారం విక్రయిస్తుంటారన్న అపవాదు ఉంది. అదే రకంగా నమ్మకంతో వ్యాపారం జరుగుతున్న పరిస్థితి కూడా ఉంది. కొంతమంది క్వాలిటీ బంగారం విక్రయించి, కస్టమర్లను ఆకర్షించి భారీ ఎత్తున వ్యాపారం కూడా చేస్తున్నారు. కానీ నరసన్నపేట గోల్డ్ బిజినెస్‌కు అధికారికంగా నకిలీ మకిలి పట్టింది. కొందరు వ్యాపారులు చేసే అడ్డగోలు, మోసపూరిత వ్యాపారంతో ఆ ప్రాంతానికే కాదు జిల్లాకే చెడ్డ పేరు వచ్చేసింది. ఇప్పుడు బంగారం కొనుగోలు చేయాలంటే భయపడే పరిస్థితి వచ్చేసింది.

నరసన్నపేటలో నకిలీ హాల్‌మార్క్‌తో దొరికిన బంగారం వ్యవహారం దాదాపు జిల్లా వ్యాప్తంగా ఉంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఈ రకమైన మోసం జరుగుతోంది. బీఐఎస్ అధికారులు తనిఖీల విషయం తెలుసుకుని ముందుగా అప్రమత్తమై చాలా మంది షాపులు మూసేయడంతో తప్పించుకున్నారు. లేదంటే అక్కడ మరికొన్నిచోట్ల మోసాలు బయటపడేవి. ఆ సమాచారం బీఐఎస్ అధికారుల వద్ద కూడా ఉంది. అదే విధంగా శ్రీకాకుళంలో కూడా నకిలీ హాల్‌మార్క్ మోసాలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్టు సమాచారం ఉంది.

**పెద్ద మోసమే..**

జిల్లాలో బంగారం క్రయవిక్రయాలు నరసన్నపేట, శ్రీకాకుళంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. హాల్‌మార్క్ వేసే సెంటర్లు అధికారికంగా ఆరు వరకు ఉన్నాయి. బీఐఎస్ హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ మార్క్ ఉన్న బంగారం ఆభరణాలకు వాస్తవంగా తిరుగుండదు. మోసపూరిత బంగారం కాదని నిర్ధారించుకోవచ్చు. ఆభరణం మీద ఉన్న హెచ్‌యూఐడీ నంబర్‌ను గూగుల్‌లో కొడితే చాలు అందులో ఎంత బంగారం ఉంది? ఎక్కడ హాల్‌మార్క్ వేశారు? వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. నరసన్నపేటలోని జీఎస్ఆర్ బంగారం షాపులో ఈ హాల్‌మార్క్ ముసుగులో జరిగిన మోసం బయటపడింది. హాల్‌మార్క్ లేకుండా కూడా బంగారం విక్రయిస్తున్నట్టు వెలుగు చూసింది. దాదాపు 1072.45గ్రాముల బంగారాన్ని విజయవాడ నుంచి వచ్చిన బీఐఎస్ అధికారుల బృందం సీజ్ చేసింది. హాల్‌మార్క్ లేకుండా విక్రయిస్తున్న బంగారంతో పాటు నకిలీ హాల్‌మార్క్‌తో ఉన్న బంగారం కూడా గుర్తించారు. ఈ నకిలీ హాల్‌మార్క్ వేయడానికి అక్కడొక సెంటర్ కూడా ఏర్పాటైంది. అనుమతి లేకుండా ఏర్పాటైన శ్రీలక్ష్మి గోల్డ్ టెస్టింగ్ అండ్ హాల్ మార్క్ సెంటర్‌లో నకిలీ హాల్ మార్క్ వేస్తున్న పరిస్థితి బయటపడింది. దీన్ని కూడా సీజ్ చేశారు.

**మోసం చేసిందిలా..**

శ్రీలక్ష్మి గోల్డ్ టెస్టింగ్ అండ్ హాల్ మార్క్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న లేజర్ మిషనరీతో నకిలీ హాల్‌మార్క్ వేస్తున్నారు. ఆ నకిలీ హాల్‌మార్క్ బయటపడకుండా ఉండేందుకు నెట్‌లో ఉన్న వేరే వారి హెచ్‌యూఐడీ నంబర్లు వినియోగిస్తున్నారు. సాధారణంగా హెచ్‌ఐయూడీ నంబర్‌ను గూగుల్ సెర్చ్ చేస్తే మొత్తం వివరాలన్నీ వచ్చేస్తాయి. ఆ రకంగా వెలుగు చూడకూడదని వేరే వారి హెచ్‌ఐయూడీ నంబర్‌ను ఉపయోగించి, సొంతంగా ఏర్పాటు చేసుకున్న మిషన్‌తో హాల్‌మార్క్ వేసి, వ్యాపారం సాగించేస్తున్నట్టుగా తేలింది.

**హాల్‌మార్క్‌ను నమ్మకూడదా..?**



నరసన్నపేటలో వెలుగు చూసిన మోసంతో బంగారం ఆభరణాలపై హాల్‌మార్క్ ఉన్నా నమ్మడానికి లేదని స్పష్టమవుతోంది. ఆ హాల్‌మార్క్ ఎంత వాస్తవమో తెలుసుకోవడానికి మరో కేంద్రం వద్ద టెస్టింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా హాల్‌మార్క్ ఉంటే బంగారానికి తిరుగులేదు అనుకుంటారు. ప్యూరిటీ ఉన్న బంగారంగా భావిస్తారు. నకిలీ టెస్టింగ్ అండ్ హాల్ మార్క్ సెంటర్ల ఏర్పాటుతో ఏది సరైన హాల్ మార్క్, ఏది నకిలీ అని తెలుసుకోలేని పరిస్థితులు ఉండటంతో కొనుగోలు దారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

## క్లుప్తంగా

### పిచ్చికుక్కల దాడిలో పలువురికి గాయాలు


కుక్కల దాడిలో బాధితుడి చేతికి ఏర్పడిన గాయం

**గరుగుబిల్లి:** పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి పలువురిని గాయపరచడంతో ప్రజలు రాకపోకలు చేసేందుకు భీతిల్లుతున్నారు. గురుగుబిల్లి మండలంలోని రావుపల్లిలో గ్రామంలో పలువీధుల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి గ్రామానికి చెందిన గుల్ల సుహంత్, కుమ్మరి సూరయ్య తదితరులను శుక్రవారం గాయాల పాలుచేశాయి. కుక్కల బెడద కారణంగా ఒంటరిగా వీధుల్లో తిరిగేందుకు, ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అలాగే సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం అన్ని వర్గాలవారు రాకపోకలు చేసేందుకు భయాందోళన చెందుతున్నారు. గాయాలపాలైన వారు గరుగుబిల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. కుక్కలను నియంత్రించాలని అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### యువకుడి అదృశ్యం


బుగత అజయ్

**పార్వతీపురం రూరల్:** పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన బుగత శ్రీనివాసరావు కుమారుడు అజయ్ కుమార్ అదృశ్యమయ్యాడు. బుధవారం ఉదయం 7గంటల సమయంలో ఢిల్లీ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిపోయాడు. మరుసటి రోజు కుమరుడి రూమ్ సర్దుతున్న సందర్భంలో అజయ్ కుమార్ ఫోన్, పర్సు ఇంట్లోనే విడిచిపెట్టి నా గురించి వెతకకండి, నన్ను క్షమించండి అని రాసి ఉన్న పేపర్‌ను తల్లిదండ్రులు గమనించారు. దీంతో భయాందోళన చెంది పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవింద తెలిపారు. ఫొటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ 9121109467, 8341517437 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంటి నుంచి వెళ్లిన అజయ్ కుమార్ నీలం రంగు ప్యాంట్, క్రీమ్ కలర్ టీషర్టును ధరించినట్లు తల్లిదండ్రులు చెప్పినట్లు తెలిపారు.

### పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య


అప్పన్న (ఫైల్)

**దత్తిరాజేరు:** మండలంలోని ముద్దాన పేట గ్రామానికి చెందిన రైతు ముద్దాన అప్పన్న(38) అప్పుల బాధలు తాళలేక పురుగు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు, పెదమానాపురం ఎస్సై ఆర్.జయంతి శుక్రవారం తెలిపారు. మృతుడి భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పన్నకు వ్యవసాయంలో నష్టం రావడంతో మనస్తాపం చెంది ఈనెల 14న రాత్రి పురుగు మందు తాగడంతో వెంటనే కుటుంబసభ్యులు గజపతినగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి విజయనగరంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మరింత విషమించడంతో వైజాగ్ కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### నేలబావిలో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రమణమూర్తి

**రాజాం సిటీ:** పట్టణ పరిధిలోని హరిజనవీధికి చెందిన రేజేటి సోమయ్య (54) నేలబావిలో పడి ప్రమాదవశాత్తు మృతిచెందాడని సీఐ కె.అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమయ్య ఈ నెల 17న మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి శుక్రవారం ఉదయం వరకు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. మృతుడి సోదరుడు భాస్కరరావు తన అన్నయ్యను వెతుకుతూ కొండంపేట సమీపంలోని తన పొలం వద్దకు వెళ్లి చూశాడు. అక్కడ నేలబావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి సోదరుడు సోమయ్యగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతుని భార్య సరోజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

### పోక్సో కేసు నమోదు

**గుర్ల:** మండలంలోని చింతలపేటకు చెందిన బాలిక ను వేధించిన కేసులో అదే గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.నారాయణ రావు శుక్రవారం తెలిపారు. బాలిక చుట్టూ తిరుగుతూ ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకోవాలని ప్రతిరోజూ ఒత్తిడి తెస్తున్నట్లు బాలిక ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

# నకిలీ ఎరువుతో జాగ్రత్త!

- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- మొదలైన పురుగు మందులు, ఎరువుల విక్రయాలు
- కొనుగోలు విషయంలో అవగాహన తప్పనిసరి
- రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి
- జిల్లాలో సుమారు 328 దుకాణాలు


ఇటీవల అలికతోటలో పురుగు మందుల దుకాణంలో మందు డబ్బాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు


రామభద్రపురంలో ఉల్లి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు


ఎస్ చింతలవలసలో పురుగుమందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖాధికారులు

**రామభద్రపురం:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ప్రస్తుతం కొద్దో గొప్పో కురుస్తున్న వర్షాలకు రైతులు పంటల సాగు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో వరి 6510 హెక్టార్లు, పత్తి 1490 హెక్టార్లు, మొక్క జొన్న 6678 హెక్టార్లు, వేరుశనగ 46 హెక్టార్లు, చెరకు 1489 హెక్టార్లు, కూరగాయలు 1000 హెక్టార్లలో సాగులో ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.అలాగే ప్రభుత్వం అనుమతి పొందిన సుమారు 328 పురుగుమందులు, ఎరువుల దుకాణాలు జిల్లాలో ఉన్నాయి. అయితే పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని రైతులు ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తున్నారు. అన్నదాతల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను అంటగట్టే అవకాశముందని, అప్రమత్తంగా వ్యవహరించకుంటే మోసపోయే ప్రమాదముందని ప్రస్తుతం అకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు, వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

#### దళారుల వద్ద కొనుగోలు చేయొద్దు

నిషేధిత మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. కొందరు ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు దిగుబడి ఎక్కువగా వస్తుందని నమ్మించి అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు అంటగట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా అనుమతులు లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు. తక్కువ ధరకే ఇస్తున్నారని కొని వాడితే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. కొనుగోలు చేసేటప్పుడు మందుల లేబుల్స్ పరిశీలించి, అవి కంపెనీ ఉత్పత్తులా? లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా? అనే విషయాలను తెలుసుకోవాలి.కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా దుకాణ యజమాని సంతకంతో కూడిన రసీదు తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించిన సంచుల సీల్ తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై ఫిర్యాదు చేయాలి.అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

#### రైతును మోసగిస్తే చట్టపరమైన చర్యలు



గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు,పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ,విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీని గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను కొనుగోలుదారులు పరిశీలించాలి. రైతులు పురుగు మందు, ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి. వ్యాపారులు నకిలీ పురుగు మందులు, ఎరువులు విక్రయించి రైతులను మోసగిస్తే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

టి.అప్పలనాయుడు, విజిలెన్స్ సీఐ

#### లైసెన్స్ రద్దు చేస్తాం



దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణం పేరుతో పాటు యజమాని సంతకంతో కూడిన బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. పురుగు మందులు తీసుకునేటప్పుడు డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. చదువు రాని వారు తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతనే కొనుగోలు చేయాలి. వ్యవసాయాధికారుల సూచన ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేకుంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.

శ్యామ్‌ప్రసాద్, ఏడీఏ, బొబ్బిలి

# చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


నియామకపత్రాలను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

**విజయనగరం:** విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించి పని చేసేచోట గుర్తింపు పొందాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హితవు పలికారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలువురికి కారుణ్య, పదోన్నతుల నియామక పత్రాలను శుక్రవారం అందజేశారు. ఇందులో భాగంగా వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవలందిస్తూ మరణించిన బయాలజీ ఉపాధ్యాయుడు డి.కన్నయ్య కుమారుడు సింహాచలానికి వియ్యంపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సహాయకుడిగా కారుణ్య నియామకపత్రాన్ని అందజేశారు. అదే విధంగా మెరకముడిదాం మండల పరిషత్ కార్యాలయంలో సహాయకుడిగా పని చేస్తున్న టి.రాములుకు మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్యాబ్ అసిస్టెంట్‌గా, బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న జి.ప్రమీలకు పాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. విజయనగరం మండల పరిషత్ కార్యాలయంలో సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసరావుకు పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డ్ అసిస్టెంట్‌గా నియామకం పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ బీవీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు

- జాతీయపోటీలకు ఎంపికైన సచిన్


బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

**విజయనగరం:** రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఇటీవల విశాఖలోని రైల్వే స్టేడియంలో జరిగిన 6వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ బాల, బాలికల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 8 పతకాలు కైవసం చేసుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం దక్కించుకున్న బి. సచిన్ వచ్చేనెల 7 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అదే విధంగా పోటీల్లో ఎన్.దేవకి, వి.జాహ్నవిలు వెండి పతకాలు దక్కించుకోగా..పి.లోకేష్, పి.దుర్గాప్రసాద్, వర్ధన్, ఆర్.యశ్వంత్, బి.గౌతమ్ గణేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఇందుకూరి అశోక్‌రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ఈ.రాజు, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో ముద్దాయికి ఏడు నెలలు జైలుశిక్ష

**విజయనగరం క్రైమ్:** గతేడాది మార్చి నెలలో జరిగిన సెల్ ఫోన్ చోరీ కేసులో ముద్దాయి కండాపు రవికుమార్‌కు విశాఖ రైల్వే కోర్టు న్యాయమూర్తి అనురాగ్ ఏడునెలల జైలు శిక్ష విధించినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీ రావు శుక్రవారం తెలిపారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న కండాపు రవికుమార్ గత సంవత్సరం మార్చినెలలో రైలులో ప్రయాణిస్తున్న పాసింజర్ సెల్‌ఫోన్ చోరీ చేయడంతో అప్పుడే కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో ముద్దాయి పార్వతీపురం జిల్లా, వీరఘట్టం మండలం, విక్రంపురానికి చెందిన కండాపు రవికుమార్‌గా గుర్తించి అరెస్ట్ చేశామని తెలిపారు. సెల్ ఫోన్ రికవర్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఏపీపీ శంకరరావు సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచారని, విచారణ తరువాత నేరం రుజువు కావడంతో రైల్వే కోర్టు జడ్జి పై విధంగా శిక్ష విధించారని ఎస్సై వివరించారు.

# నీ వెంటే నేను..!

- మరణంలోనూ వీడని దంపతుల బంధం
- భర్త మృతిచెందిన కొద్ది సమయానికే భార్య మృతి


పోలమ్మ(ఫైల్)


పకీరునాయుడు(ఫైల్)

**కొమరాడ/పార్వతీపురం రూరల్:** నాతిచరామి..అన్న పెళ్లినాటి ప్రమాణానికి కట్టుబడి ఉన్నారా దంపతులు. వివాహం అయినప్పటి నుంచి ఒకరికొకరు తోడుగా అన్యోన్యంగా ఉంటూ జీవనం సాగించారు. వృద్ధాప్యం వచ్చినప్పటికీ వారిలో అన్యోన్యత ఏ మాత్రం తగ్గలేదు. కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కలిసి జీవనం సాగిస్తున్న ఆ దంపతులు మరణంలోనూ వారి బంధాన్ని వీడలేదు. భర్త మరణ వార్త విన్న భార్య భావోద్వేగానికి లోనై కొద్ది క్షణాల్లోనే మరణించింది. ఈ ఘటన కొమరాడ మండలంలోని కళ్లికోట గ్రామంలో జరిగింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సీర పకీరునాయుడు (80), సీర పోలమ్మ (75) దంపతులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల పకీరునాయుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుటపడక గురువారం మధ్యాహ్నం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య భావోద్వేగానికి గురై సాయంత్రం మృతిచెందింది. భార్యాభర్తలు ఒకే రోజు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# అనాథ వృద్ధురాలికి సేవలు


కాలిపై పుండుకు డ్రెస్సింగ్ చేస్తున్న కరుణామయులు



- సాక్షి కథనానికి స్పందించిన దయార్ద్ర హృదయులు


**విజయనగరం అర్బన్:** ఈ నెల 12వ తేదీన సాక్షి దినపత్రికలో 'అమ్మ రోడ్డున పడింది' శీర్షికన వచ్చిన వార్త మరికొంత మందిని కదిలించింది. తొలి రోజున కొందరు స్పందించి శుభ్రమైన నీటితో ఆమెకు స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపచేసి షెల్టర్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి ఆ వృద్ధురాలికి ప్రతి రోజూ కొందరు దయార్ద్ర హృదయులు మానవత్వంతో సేవలు అందిస్తున్నారు. సమీపంలోని ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ తదితర శాఖల ఉద్యోగులు అబ్రహం పీటర్ పాల్, వెంకాయమ్మ, రాగిణి, గీతి తదితరులు మేము సైతం అంటూ చేయి చేయి కలిపి సేవలు చేస్తున్నారు. వృద్ధురాలి కాలు, శరీరంపై పుండ్లను శుభ్రం చేయడం, స్నానం చేయించడం, కొత్త వస్త్రాలు ధరించేలా చేయడం, ఆహారం, మందులు అందించడం వంటి పనులు చేస్తున్నారు. ఈ నిస్వార్థ సేవలు నిజమైన సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# 44 మద్యం బాటిల్స్ స్వాధీనం

**రాజాం సిటీ:** మండల పరిధి పొగిరి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 44 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

గ్రామానికి చెందిన బత్తుల జనార్దననాయుడు, గెంబలి సత్యనారాయణలు చెరో 22 మద్యం బాటిల్స్ చొప్పున అక్రమంగా తరలిస్తున్నారని, శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా వారిని తనిఖీ చేయగా మద్యం బాటిల్స్ అక్రమంగా తరలిస్తూ పట్టుబడడంతో అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేశామని తెలిపారు.

# యాభై ఏళ్ల వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన గౌరినాయుడు

**విజయనగరం క్రైమ్:** భార్య అన్నం సరిగా వండలేదని అలిగిన ఓ భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన శుక్రవారం విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఇందుకు సంబంధించి ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం మండలం కొండకరకాం గ్రామానికి చెందిన యజ్జపురపు గౌరినాయుడి(50)కు భార్య సత్యవతితో ఒక పాప ఉంది. ఇన్నాళ్లూ అన్యోన్యంగా సాగిన భార్యాభర్తల కాపురంలో 'అన్నం' చిచ్చు పెట్టింది. తనకు సరిగా అన్నం వండి పెట్టలేదన్న కోపంతో భర్త గౌరినాయుడు అలిగాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య గలాటా జరిగింది. దీంతో ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయి నేటివరకు ఇంటికి చేరకపోవడంతో భార్య సత్యవతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో లేదని ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అక్షరాంధ్రతో శతశాతం అక్షరాస్యత

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్

**విజయనగరం అర్బన్:** అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో శతశాతం అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అక్షరాంధ్ర ప్రత్యేక కార్యక్రమం ద్వారా దశలవారీగా జిల్లా ప్రజలందరినీ అక్షరాస్యులను చేయాలని సూచించారు. దీనిలో భాగంగా మొదటి విడత సుమారు లక్షన్నర మందిని అక్షరాస్యులను చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. ఈ మేరకు అక్షరాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమం అమలుకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఉపాధిహామీ వేతనదారులు, వెలుగు, మెప్మా, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ ఆయాలు, ఆ శాఖ ద్వారా లబ్ధి పొందుతున్న గర్భిణులు, బాలింతల్లో నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులను చేయాలని సూచించారు. ఈ నెల 26లోగా నిరక్షరాస్యుల జాబితాను రూపొందించాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఏపీఓ, సీడీపీఓ, ఎంఈఓలు సభ్యులుగా మండల కమిటీలను ఈ నెల 26లోగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వలంటీర్ల ఎంపికను త్వరగా పూర్తి చేసి, వారికి శిక్షణ నిర్వహించాలని చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలను సైతం వలంటీర్లుగా నియమించే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో వయోజన విద్య ఇన్‌చార్జ్ డీడీ ఎస్.సుబ్రహ్మణ్య వర్మ, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సావిత్రి, డీఈఓ యు.మాణిక్యం నాయుడు, ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి, డ్వామా పీడీ శారదాదేవి, జీఎస్‌డబ్ల్యూఎ జిల్లా కోఆర్డినేటర్ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

#### వాయు కాలుష్యం లేని నగరంగా విజయనగరం


విజయనగరం పట్టణాన్ని వాయు కాలుష్యంలేని నగరంగా తీర్చి దిద్దడానికి కృషి చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్ ఆదేశించారు. నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. ఎన్‌సీఏపీ కింద పార్కులు, రహదారుల అభివృద్ధి కోసం జిల్లాలో 14 పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపగా రూ.2.84 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అందులో నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి 12 పనులకు రూ.71 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 4 పార్కులను అభివృద్ధి చేసేందుకు అలాగే బీటీ రోడ్లు, ఉద్యానవనాల పెంపకం, డ్రైనేజీలు, ఫుట్ పాత్స్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేసి ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు చెప్పారు. సమావేశంలో కాలుష్య నియంత్రణమండలి ఈఈ సరిత, కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, పరిశ్రమల శాఖ జీఎం కరుణాకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, ఉద్యాన శాఖ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాతపెన్షన్ కోసం గురువుల డిమాండ్


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో టీచర్లు

**విజయనగరం అర్బన్:** డీఎస్సీ-2003 టీచర్లకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఆ టీచర్ల ఫోరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయనగరం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశంలోని 16 రాష్ట్రాలు, ఆయా రాష్ట్రాలలో 2004 సెప్టెంబర్ 1కి ముందు నోటిఫై అయిన పోస్టులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2020 ఫిబ్రవరి 17 నుంచి 2023 మార్చి 3వ తేదీ మధ్యలో నియామకాలకు పాత పెన్షన్ వర్తింపజేశారన్నారు. మన రాష్ట్రంలో సంబంధిత కాలంలో నోటిఫై అయిన 11 వేల ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే మన రాష్ట్రంలో మెమో 57, జీఓ 2,140 ప్రకారం ముగ్గురు ఐపీఎస్‌లకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల ధర్నాకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ పి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు కె.విజయగౌరి, జేఏవీ ఆర్‌కే ఈశ్వరరావు, పీఆర్‌టీయూ నాయకులు డి.శ్రీనివాస్, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్ తదితరులు మద్దతు తెలిపారు.

# ప్లాస్టిక్ సంచుల గొడౌన్‌లో అగ్నిప్రమాదం


గొడౌన్‌లో చెలరేగుతున్న మంటలు


అగ్నిప్రమాదాన్ని చూసేందుకు జనాలు రావడంతో కిక్కిరిసిన రహదారి

- అదుపులోకి రాని మంటలు
- ప్రయత్నిస్తున్న ఫైర్ సిబ్బంది

**వీరఘట్టం:**

వీరఘట్టం యూనియన్ బ్యాంకు పక్కనే ఉన్న ప్లాస్టిక్ సంచుల గొడౌన్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గొడౌన్‌లో విలువైన ప్లాస్టిక్ పైపులతో పాటు పాలిథిన్ సంచులకు నిప్పు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.ఈ మంటలను అదుపు చేసేందుకు పాలకొండ ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు తన సిబ్బందితో వచ్చి అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే మంటలు అదుపు కాకపోవడంతో పాటు రెట్టింపు మంటలు చెలరేగడంతో సమీప ఇళ్ల వారు భయాందోళన చెందుతున్నారు. అయితే అగ్నిప్రమాదం ఏవిధంగా జరిగిందో తెలియాల్సి ఉంది. అగ్ని ప్రమాదాన్ని చూసేందుకు స్థానికులు సంఘటనా స్థలానికి రావడంతో ఫైర్ అధికారులకు కొంత ఆటంకం కలిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.18 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు గొడౌన్ యజమాని వాపోతున్నాడు.